సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 12 । మే । 2025



సూర్య దేవాలయానికి రూ.1.11 లక్షలు


గోకవరం: గ్రామ శివారున నిర్మిస్తున్న స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి సొసైటీ మాజీ అధ్యక్షుడు మంగరౌతు దుర్గా శ్రీనివాస్ దంపతులు రూ.1,11,111 విరాళం అందజేశారు.



అన్నదానానికి విరాళం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శాశ్వత అన్నదానానికి రాయుడు దుర్గా సూర్యనారాయణ, సంగీత దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

10.05 అడుగులకు నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం గోదావరి మిగులు జలాల విడుదలను నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఫస్టియర్ విద్యార్థులకు 37 కేంద్రాల్లోను.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ సెకండియర్ విద్యార్థులకు 16 కేంద్రాల్లోను ఈ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 20, 466 మంది ఈ పరీక్షలు రాయనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నారు. అన్ని కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ తదితర సదుపాయాలు కల్పించారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే చేరుకోవాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం సూచించారు. ఈ పరీక్షలకు 37 మంది చీఫ్ సూపర్‌వైజర్లు, 37 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఏడుగురు కస్టోడియన్లను నియమించామని తెలిపారు.

డీఎస్సీపై రేపు అవగాహన సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డీఎస్సీ పరీక్షపై యూటీఎఫ్‌తో కలసి రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు తెలిపారు. సదస్సు కరపత్రాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ సదస్సుకు పోటీ పరీక్షల నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు హాజరై, విలువైన సమాచారం అందిస్తారన్నారు. డీఎస్సీ అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోరాట ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ సాధించుకోగా, నేడు ఓపెన్ కేటగిరీకి అర్హతలు లేవని చెప్పడం దారుణమని అన్నారు. టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, మన రాష్ట్రంలో కూడా 47 సంవత్సరాల వరకూ వయోపరిమితి పెంచాలని, జిల్లా అంతటా ఒకే పేపర్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకుంటే డీఎస్సీ అభ్యర్థులతో కలిసి పోరాటాలు చేపడతామని అన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా శేషారావు

ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్



శేషారావు



జవహర్

నిడదవోలు: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) చైర్మన్‌గా నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేఎస్ జవహర్ నియమితులయ్యారు. ఆదివారం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో ఈ విషయం వెల్లడించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన తర్వాత నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాలకు చెందిన సీనియర్ నాయకులు బూరుగుపల్లి శేషారావు, కేఎస్ జవహర్‌లు టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్లు దక్కకపోవడంతో ఆందోళనలు చేశారు. పొత్తులో భాగంగా నిడదవోలు సీటును జనసేన నుంచి ప్రస్తుత రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌కు కేటాయించారు. అలాగే, కొవ్వూరు నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన జవహర్‌ను అణచివేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో 2019, 2024 ఎన్నికల్లో ఆయనకు కొవ్వూరు సీటు ఇవ్వకుండా పక్కన పెట్టారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు టికెట్టు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శేషారావుకు, జవహర్‌కు నామినేటెడ్ పదవులు కట్టబెట్టడం వారి వర్గాలకు కాస్త ఊరటనిచ్చింది.

మండు వేసవిలోనూ లోవకు భక్తుల తాకిడి



క్యూలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్: మండు వేసవిలోనూ తలుపులమ్మ అమ్మవారి సన్నిధి వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని డిప్యూటీ కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,24,140, పూజా టికెట్లకు రూ.73 వేలు, కేశఖండన శాలకు రూ.16,130, వాహన పూజలకు రూ.9,860, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.63,772, విరాళాలు రూ.77,577 కలిపి మొత్తం రూ.3,64,479 ఆదాయం సమకూరిందని వివరించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా వేద పండితులు, ప్రధానార్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

కేంద్రం చేతిలోకి.. ఉపాధి స్టీరింగ్!



నిడదవోలు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- కొత్తగా 'యుక్తధార' యాప్
- దీని ద్వారా ఏ ప్రాంతంలో ఎప్పుడు పని చేయాలో నిర్దేశించనున్న కేంద్రం
- పథకాన్ని తన చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు ఎత్తుగడ
- రాష్ట్రాల హక్కులకు మంగళం పాడే దిశగా సంస్కరణలు

జిల్లాలో ఉపాధి పథకం బ్లాకులు	18
పంచాయతీలు	300
మంజూరైన జాబ్‌కార్డులు	1.69 లక్షలు
కూలీలు	2.61 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.23 లక్షలు
పనులు వినియోగించుకుంటున్న కూలీలు	1.76 లక్షలు
ఒక్కో కూలీ సగటు వేతనం	రూ.254
ఏటా కల్పిస్తున్న పని దినాలు	53 లక్షలు
వెచ్చిస్తున్న నిధులు సుమారు రూ.152 కోట్లు	

సాక్షి, రాజమహేంద్రవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తోందా.. ఇప్పటి వరకూ రాష్ట్రాల అజమాయిషీలో ఉన్న ఈ పథకం నిర్వహణ పూర్తిగా కేంద్రం చేతికి వెళ్లనుందా.. ఇకపై పనుల కల్పన, అంచనాల ప్రక్రియను కేంద్రమే పర్యవేక్షించనుందా.. ఇందులో భాగంగానే నూతన మొబైల్ యాప్ తీసుకొచ్చిందా.. రాష్ట్ర ప్రభుత్వం పాత్ర నామమాత్రంగా మారనుందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది.

ఇదీ సంగతి

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు 100 రోజుల ఉపాధికి గ్యారెంటీ కల్పించాలని, ఉన్న ఊళ్లోనే పనులు కల్పించాలనే డిమాండుతో దేశవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు జరిగాయి. అనంతరం, అప్పటి యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నాంది పలికింది. దీనిపై 2005లో చట్టం రూపొందించింది. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసింది. ఏపీఓ, ఎంపీడీఓలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. పనుల కల్పన నుంచి, బిల్లుల చెల్లింపుల వరకూ అన్నీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే నడిచేలా చర్యలు తీసుకుంది. ఏదైనా గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలంటే ఆయా గ్రామ పంచాయతీలు సామూహికంగా ఒక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించే వెసులుబాటు కల్పించారు. దీనినే సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ అంటారు. దీనిని గ్రామ కార్యదర్శి నిర్వహించాలి. ఉపాధి హామీ చట్టం–2005 ప్రకారం గుర్తించిన పనులను గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ తీర్మానాల అనంతరం మంజూరు చేయాలి. ఇప్పటి వరకూ ఇదే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పుడు కేంద్రం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యాప్‌తో ఇవన్నీ కనుమరుగుకానున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

యాప్‌తో ఏం చేస్తారంటే..

ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'యుక్తధార' పేరిట సరికొత్త మొబైల్ యాప్ తీసుకొచ్చింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పనులను తన అజమాయిషీలో నిర్వహించేందుకు కేంద్రం సర్వం సిద్ధం చేసింది. ఏ రాష్ట్రంలో ఎలాంటి పనులు జరుగుతున్నాయి.. ఏ ప్రాంతంలో ఏ పని ఎప్పుడు పెట్టాలి.. అంచనాలు ఎలా వేయాలి.. బిల్లులు చెల్లింపులు ఎలా జరగాలనే అంశాలన్నింటినీ ఈ యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చునే కేంద్ర ప్రభుత్వ అధికారులు నిర్ణయించే అవకాశం కలుగుతుంది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన లేబర్ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తిస్తుంది. పనులు చేపట్టిన కూలీలకు కేంద్రమే నేరుగా బిల్లులు చెల్లిస్తుంది. యుక్తధార మొబైల్ యాప్ వినియోగం ఇప్పటికే ప్రారంభమైంది. తొలి దశలో జిల్లా వ్యాప్తంగా మండలానికో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నారు. అనంతరం, రెండో దశలో జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ దీనిని అమల్లోకి తెస్తారు. నిడదవోలు మండలం శెట్టిపేటలో ప్రస్తుతం ఇదే పద్ధతిలో పనులు కల్పిస్తున్నారు.

రాష్ట్రాల హక్కులకు భంగం

యుక్తధార యాప్ వలన రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉపాధి పథకం నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు, ఇతర భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ యాప్ ద్వారా కేంద్ర పర్యవేక్షణ మొదలైతే భవిష్యత్తులో ఈ పనులన్నీ చేసే వీలుంటుందా.. ఈ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు ఎవరి పర్యవేక్షణలో విధులు నిర్వర్తించాలి.. రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే, అవినీతి నిర్మూలనకే ఈ యాప్ తెచ్చామని కేంద్రం చెబుతోంది. అవినీతి నిర్మూలించాలంటే కఠిన నిబంధనలు తీసుకురావాలే తప్ప.. కేంద్రం ఆధీనంలోకి తీసుకోవడమేంటనే వాదన కూడా వినిపిస్తోంది. దీని వలన పనుల కల్పన తగ్గే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఈ యాప్ వలన ఉపాధి హామీ పథకంపై రాష్ట్రాలు తమ హక్కులను కోల్పోతాయని, ఇది పూర్తిగా ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కోకో.. కోలుకోలేక..

- గింజల ధర నేల చూపులు
- గత ప్రభుత్వ హయాంలో కిలోకు రూ.1,050 ఆదాయం
- నేడు రూ.500కు పతనం
- కొనుగోలు సంస్థల సిండికేట్
- గిట్టుబాటు కాక, కొనే నాథుడు లేక రైతుల గగ్గోలు



తీపర్రులో కోకో తోట



తీపర్రులో ఆరబెట్టిన కోకో గింజలు

పెరవలి: మార్కెట్లో ఒక సరకు సరఫరా తగ్గితే సహజంగానే దానికి డిమాండ్. అందుకు అనుగుణంగా ధరలు పెరుగుతాయి. అర్థశాస్త్రంలో ఇది ప్రాథమిక ఆర్థిక సూత్రం. ఇది ఎక్కడైనా చెల్లుతుందేమో కానీ.. రైతుల విషయంలో మాత్రం ఎప్పుడూ తల్లకిందులవుతూనే ఉంది. పొగాకు, నిమ్మ, వరి రైతులు ఇప్పటికే సరైన గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారు. ఈ కోవలో కోకో రైతులు కూడా చేరారు. ఓవైపు గింజల దిగుబడి తగ్గింది. ఇటువంటి సమయంలో మార్కెట్‌లో వీటి ధర పెరగాలి. కానీ, గోరుచుట్టుపై రోకలి పోటులా కొనుగోలు సంస్థలు సిండికేట్ అయ్యి ముందుకు రాకపోవడంతో కోకో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

16 వేల హెక్టార్లలో..

జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల మంది రైతులు 16 వేల హెక్టార్లలో రైతులు కోకో సాగు చేస్తున్నారు. పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, చాగల్లు, దేవరపల్లి, కొవ్వూరు, కడియం, సీతానగరం, బిక్కవోలు తదితర మండలాల్లో కోకో సాగు జరుగుతోంది. ఒక్క నిడదవోలు నియోజకవర్గంలోనే 860 ఎకరాల్లో కోకో సాగు జరుగుతూండగా, దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా సీజన్‌లో సుమారు 2.64 లక్షల క్వింటాళ్ల కోకో గింజల ఉత్పత్తి జరుగుతుంది.

రైతుల ఆశలపై నీళ్లు

సాధారణంగా ప్రతి పంట సీజన్‌లో ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ, ఈ ఏడాది అది రెండు మూడు క్వింటాళ్లకు పడిపోయింది. ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ ఏర్పడి, మార్కెట్లో మంచి ధర లభిస్తుందని రైతులు భావించారు. కానీ, ప్రైవేటు కొనుగోలు సంస్థలు సిండికేట్ అయ్యి, రైతుల ఆశలపై నీళ్లు జల్లారు. గత ఏడాది ఇదే సమయంలో కిలో కోకో గింజలకు రూ.1,050 చొప్పున ధర పలికింది. ఈసారి కూడా ధర ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశ పడ్డారు. గింజలు ఫ్యాక్టరీలకు తీసుకెళ్తే కనీసం గేట్లు కూడా తీయటం లేదని, మార్కెట్ ధరకే అమ్ముతామన్నా వద్దంటున్నారని చెబుతున్నారు. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాల్లో మామూళ్లు ఇస్తే కిలో గింజలకు రూ.500 మాత్రమే చెల్లిస్తున్నారని వాపోతున్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.60 వేలు అవుతూండగా, ఇటు దిగుబడి, అటు ధర తగ్గిపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. దిగుబడి రెండు క్వింటాళ్లు మాత్రమే రావడంతో వచ్చిన సొమ్ము ఖర్చులకు సరిపోతోందని ఒక రైతు చెప్పారు. ఈ పరిస్థితుల్లో నష్టాన్ని తగ్గించుకునేందుకు చాలాచోట్ల రైతులే కాయలు కోసి, గింజలు తీసుకుంటున్నారు. దీనివలన తమకు పనులు లేకుండా పోయాయని కూలీలు ఆవేదన చెందుతున్నారు.

నష్టాలు చవిచూశా..



గత ఏడాది కంటే అధిక ధర పలుకుతుందని ఆశించాం. కానీ, తక్కువ ధర లభించింది. దిగుబడి కూడా తగ్గటంతో లాభాలు లేకపోగా రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. కిలో రూ.500 పలుకుతున్నా గత్యంతరం లేక అయినకాడికి అమ్ముకోవలసి వస్తోంది.

– కంటిపూడి సూర్యనారాయణ, రైతు, తీపర్రు

చాలా దారుణం



కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో గింజల ధర తగ్గించాయి. నేడు రూ.500 ధరకు కూడా కొనే నాథుడు లేడు. కంపెనీకి తీసుకెళ్తే కనీసం గేట్లు కూడా తీయటం లేదు. ఇంత దారుణం ఎప్పుడూ లేదు.

– వాకలపూడి సూర్యారావు, రైతు, కానూరు

రథోత్సవంపై సూర్య ప్రతాపం

- జనం రాక కళ తప్పిన ఉత్సవం
- నూతన రథంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు



రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన గ్రామస్తులు

అన్నవరం: సత్యదేవుని రథోత్సవంపై సూర్యుడు ప్రతాపం చూపించాడు. నిప్పుల వర్షం కురిసినట్టుగా ఎండ కాయడంతో ఆశించిన స్థాయిలో భక్తులు రాకపోవడంతో ఉత్సవం కళ తప్పింది. వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం సాయంత్రం సత్యదేవుని రథోత్సవం నిర్వహించారు. ఎండ తీవ్రతకు తోడు సరైన ప్రణాళిక లేకపోవడంతో రథోత్సవం ప్రారంభ సమయానికి గ్రామస్తులు, భక్తులు పెద్దగా రాలేదు. గత ఏడాది సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ప్రారంభమై రాత్రి 9.30 గంటల వరకూ కొనసాగగా, ఈసారి 4 గంటలకు మొదలై రాత్రి 7.30 గంటలకే ముగిసింది. గత ఏడాది రథోత్సవం సాయంత్రం 5 గంటలకు మొదలైంది. అప్పటికి ఎండ తగ్గడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఈసారి ఉత్సవం మొదలయ్యే సమయానికి 35 డిగ్రీల సెల్సియస్‌కు పైబడి ఉష్ణోగ్రత ఉండటంతో గ్రామస్తులు, భక్తులు పెద్దగా రాలేదు. వారితో పోలిస్తే దేవస్థానం సిబ్బంది, పోలీసులు, కళాకారులే అధికంగా కనిపించారు. ప్రారంభ సమయానికి 250 మంది దేవస్థానం సిబ్బంది, 150 మంది పోలీసులు, 200 మంది కళాకారులు మాత్రమే ఉన్నారు. సాయంత్రం 5.30 గంటల సమయానికి కాస్త ఎండ తగ్గడంతో గ్రామస్తులు వచ్చారు. ఉత్సవం ముగిసే సమయానికి సుమారు 3 వేల మంది మాత్రమే ఉన్నారు.

ఉత్సవం జరిగిందిలా..

సత్యరథాన్ని ఉదయం 8 గంటలకు పంపా సత్రం నుంచి రత్నగిరి తొలి పావంచా వద్దకు తీసుకువచ్చారు. సాయంత్రం 4 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకులు ఊరేగింపుగా తొలి పావంచా వద్దకు తీసుకువచ్చి, రథంపై వేంచేయించి, పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు రథం ముందు కుంభం పోసి, గుమ్మడికాయతో దిష్టి తీశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు రథోత్సవాన్ని ప్రారంభించారు. తొలి పావంచా నుంచి ఆంధ్రా బ్యాంక్ వరకూ, అక్కడి నుంచి తిరిగి తొలి పావంచా మీదుగా దేవస్థానం టోల్‌గేట్ వరకూ, అక్కడి నుంచి కొత్తగా నిర్మించిన రథం షెడ్డు మీదుగా తొలి పావంచా వరకూ రథోత్సవం సాగింది. అనంతరం, స్వామి, అమ్మవార్లను రథం నుంచి కిందకు దించి, ఊరేగింపుగా కొండపై ఆలయానికి చేర్చారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం హర్షణీయం



రక్తదానం చేస్తున్న మాజీ ఎంపీ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ హర్షం వ్యక్తం చేశారు. భారతీయులందరూ సగర్వంగా కాలర్ ఎగరేసుకుని ఉండేలా నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, మన దేశ రక్షణ దళాలకు ఈ క్రెడిట్ దక్కుతుందని, వారికి సెల్యూట్ చేస్తున్నానని ఆయన అన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం స్థానిక కొత్తపేట రౌతు తాతాలు కల్యాణ మండపంలో జైన్ సేవా సమితి ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో భరత్ పాల్గొని, స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న పిల్లల కోసం జైన్ సేవా సమితి రాజమహేంద్రవరంతో పాటు దేశవ్యాప్తంగా చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ వ్యాధి రాకుండా ఉండటానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. వివాహాల సమయంలో తలసేమియాకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకుంటే మంచిదని సూచించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. జాగృతి బ్లడ్ బ్యాంకు, మాగ్నా ఆసుపత్రి సౌజన్యంతో ఈ రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించడంపై భరత్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అశోక్ కుమార్ జైన్, విక్రమ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

విద్య.. అస్తవ్యస్తీకరణ!

- సమస్యలపై యూటీఎఫ్ పోరుబాట
- డీఈవో కార్యాలయాల ఎదుట నేడు ధర్నా
- 117 జీవో రద్దు.. రీస్ట్రక్చరింగ్‌పై స్పష్టత కోరుతూ నిరసనకు సమాయత్తం



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

రాయవరం: ఉపాధ్యాయ సమస్యలపై యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) పోరుబాట పట్టింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జీవోను రద్దు చేయాలని, పాఠశాలల రీ స్ట్రక్చరింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ దశల వారీ ఆందోళనకు యూటీఎఫ్ పిలుపునిచ్చింది. అలాగే బదిలీలు, పదోన్నతులకు అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధ్యాయులు సన్నద్ధమవుతున్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో స్పష్టమైన జీవోలు లేకుండా రోజుకో విధమైన ఆలోచనతో పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు ఎదురుగా ధర్నాకు సన్నద్ధమవుతున్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు..

- జీవో 117 రద్దు చేసి అందులోని లోపాలను సవరిస్తూ ప్రస్తుతం చేపడుతున్న రీ స్ట్రక్చరింగ్ విధానాలను పొందుపరుస్తూ కొత్త జీఓ విడుదల చేయాలి.
- అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించాలి.
- మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఐదు తరగతులు బోధించడానికి ఐదుగురు టీచర్లు నియమించాలి. విద్యార్థుల సంఖ్య 75 మించితే పీఎస్ హెచ్ఎం పోస్టు అదనంగా కేటాయించాలి. అలాగే విద్యార్థుల సంఖ్య 120కి మించితే 6వ ఎస్‌జీటీ, ఆపై ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్‌జీటీ వంతున కేటాయించాలి.
- ఉర్దూ, మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్‌జీటీ/ఎస్‌ఏలతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదు. ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలి.
- అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలి.
- స్కూల్ అసిస్టెంట్లు రెండు కేటాయిస్తే ఒకటి లాంగ్వేజ్, రెండోది నాన్ లాంగ్వేజ్, నాలుగు పోస్టులు కేటాయిస్తే రెండు లాంగ్వేజ్, రెండు నాన్ లాంగ్వేజ్ పోస్టులు కేటాయించాలి.
- స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేవలం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాత్రమే నియమించాలి. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంను కొనసాగించాలి.
- ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45కు మించితే రెండో సెక్షన్ ఏర్పాటు చేసి, తదనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలి.
- విద్యార్థుల సంఖ్య 300 దాటిన హైస్కూళ్లలో రెండో పీడీ పోస్టు కేటాయించాలి.

పదోన్నతుల్లో..

- ప్రమోషన్ సీనియారిటీ సమస్యలు పరిష్కరించిన తర్వాత పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలి.
- బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వేర్వేరుగా చేపట్టాలి. 610 జీవోలో జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల సీనియారిటీకి రక్షణ కల్పించాలి.
- మున్సిపల్ పాఠశాలల్లో అప్‌గ్రెడేషన్ ప్రక్రియ సత్వరమే చేపట్టి పదోన్నతులు ఇవ్వాలి.

బదిలీలకు సంబంధించి..

- బదిలీల జీవో తక్షణం విడుదల చేసి, వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి.
- బదిలీల ప్రక్రియకు ముందే ప్లస్ 2 పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ బోధనకు అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలి.
- ఎస్‌జీటీల బదిలీల్లో మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలి.
- స్కూల్ అసిస్టెంట్ టీచర్లు (స్పెషల్ ఎడ్యుకేషన్)కు బదిలీల్లో కొత్తగా మంజూరు చేసిన పోస్టులను ఖాళీలుగా చూపాలి.

ఉపాధ్యాయుల్లో గందరగోళం



ఏ జీవో ప్రకారం పాఠశాలలను రీస్ట్రక్చర్ చేస్తున్నారో ప్రభుత్వం స్పష్టమైన జీవో విడుదల చేయాలి. అలా కాకుండా రీస్ట్రక్చర్ చేస్తే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయలేం. ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని ప్రభుత్వం తొలగించేలా చర్యలు చేపట్టాలి. పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను సరిచేసి, సీనియారిటీ జాబితాను విడుదల చేయాలి. – అహ్మద్ షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్, తూర్పు గోదావరి జిల్లా

సీహెచ్‌ఓల డిమాండ్లు నెరవేర్చాలి



సీహెచ్‌ఓలను ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యాసాగర్

రాజమహేంద్రవరం రూరల్: సీహెచ్‌ఓల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేంత వరకూ తమ ఉద్యమం కొనసాగుతుందని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (ఏపీఎంసీఏ) అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యాన సీహెచ్‌ఓలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని విద్యాసాగర్ సందర్శించి సీహెచ్‌ఓలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరేళ్లు నిండిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలనే నిబంధన ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇంక్రిమెంట్లు, ఇన్సెంటివ్‌లు లేక సీహెచ్‌ఓలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.మమత మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఫిట్స్‌తో వ్యక్తి మృతి


మృతుడు వెంకటరమణ

కడియం: స్థానిక కాలువగట్టున ఆలమూరు మండలం నర్శిపూడి గ్రామానికి చెందిన గుబ్బల వెంకటరమణ (40) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. వారి కథనం మేరకు నర్శిపూడి గ్రామానికి చెందిన వెంకటరమణ కాలువలో గేలంతో చేపలు పట్టి అమ్ముతుంటాడు. శనివారం మధ్యాహ్నం కడియం కాలువగట్టుకు చేపలు పట్టడానికి వెళ్లాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు వెంకటరమణ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఆరా తీశారు. వెంకటరమణకు తరుచూ ఫిట్స్ వస్తుంటాయని, అలా శనివారం ఫిట్స్ వచ్చి కాలువగట్టున పడిపోయి ఉండి ఉంటాడని, ఎవరూ గమనించకపోవడంతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల రామస్వామి (బాబు)ను, డీసీఎంఎస్ చైర్మన్‌గా పెచ్చెట్టి చంద్రమౌళిని నియమించారు. గత కొన్ని రోజులుగా డీసీసీబీ చైర్మన్ పదవులకు పలువురి పేర్లు వినిపించినా చివరికి రామస్వామిని నియమించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

నర్సింగ్ నైటింగేల్!



- సేవే లక్ష్యం, ప్రేమే మార్గంగా రోగుల సేవ
- ప్రపంచానికి ఆదర్శంగా నిలచిన ఫ్లోరెన్స్
- ఆమె మార్గంలో నేడు ఎందరో పయనం
- వారి శ్రేయస్సు ప్రభుత్వాల కనీస బాధ్యత

మాటే మంత్రం.. మంత్రం లక్షణం.. మనసుపై బలమైన ముద్రవేసి సమస్య పరిష్కరించడం. ఈ లక్షణాన్ని నూరు శాతం కలిగి ఉన్న మన ఊరి మంత్రసాని ఆమె. కాలక్రమంలో నామాంతరం.. రూపాంతరం చెంది నర్సులుగా సమాజ సేవ చేస్తోంది. రోగం ఎంత క్లిష్టమైనదైనా.. రోగి శరీరం.. మనసు ఎంత అవసానంలో ఉన్నా తన అనునయ వాక్యాలతో మనసును ఊరడించి రోగ భయాన్ని తగ్గించి మానసికంగా రోగం తగ్గడానికి ఉద్యుక్తుడిని చేసి వైద్యుడు ఇచ్చిన ఔషధం ఒంటబట్టేలా చేస్తుంది. ఎంత పెద్ద ఆస్పత్రి అయినా.. వైద్యుడు ఎంతటి ప్రవీణుడైనా ఆమె మాటల అనుపానం లేకపోతే ఎందరో రోగులు అంత తీవ్రతరమైన రోగం లేకపోయినా మానసిక భయంతో విలువైన ప్రాణాలు కోల్పోయేవారు. ఎంతో దూరం పోనవసరం లేకుండా ఇటీవల కొన్ని వేల మందిని కబళించిన కరోనాయే ఇందుకు సాక్ష్యం. ఆ కష్టకాలంలో ఎందరో రోగులు మానసికమైన ఒత్తిడిని తట్టుకోలేకే మృతి చెందారన్నది నిర్వివాదాంశం. సరైన వైద్యాన్ని సకాలంలో అందిస్తూ సేవ చేసే మంత్రముగ్ధులైన నర్సులు నిజమైన సమాజ సేవకులు. వారికి ప్రేరణ.. ఆదర్శం ఫ్లోరెన్స్ నైటింగేల్. నిజంగా ఆమె సార్థకనామధేయురాలు. నైటింగేల్ అంటే మధురమైన గానం చేసే పక్షి అని అర్థం. ఆమె మాటల ప్రభావం ఎంతటిదో ప్రపంచం నేడు గుర్తిస్తోంది. ఇటలీలో జన్మించి ఐర్లాండులో నర్సింగ్‌లో సంస్కరణలకు నాంది పలికిన మహోన్నత సేవా శిఖరం. నేడు ఆమె జయంతిని పురస్కరించుకుని నర్సుల దినోత్సవం సందర్భంగా కథనం.


కాకినాడ కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నర్సులు (ఫైల్)

కపిలేశ్వరపురం: సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి మనిషి సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించాలి. రోగభయం లేని సమాజానికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. జనాభా, ఆరోగ్య ప్రమాణాల ప్రాతిపదికన తగినన్ని ఆస్పత్రులను, వైద్యులను, సిబ్బందిని నియమించాలి. వారి పూర్తి సేవలు రోగులకు అందేలా సహకరించాలి. వైద్యం ఎంత ఉన్నతంగా చేసినా సిబ్బంది, నర్సుల సహకారం లేకపోతే అంతా వృథా అయినట్టే. సమాజ ఆరోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర ఎంతో కీలకం.

ఉమ్మడి జిల్లాలో నర్సులు ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 135 పీహెచ్‌సీలు, 22 సీహెచ్‌సీలు, 7 ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. కాకినాడలో జీజీహెచ్, రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నాయి. ప్రభుత్వ, గ్రామీణ, అర్బన్ సీహెచ్‌సీల్లో 1,445 మంది హెల్త్ సెక్రటరీలున్నారు. 200 మంది ఏఎన్‌ఎంలు, 473 మంది స్టాఫ్ నర్సులు, 1232 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,396 మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 480, కాకినాడ జిల్లాలో 450, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 165 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వేలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నర్సులుగా పనిచేస్తున్నారు.

నర్సుల డిమాండ్లు వినేవారేరీ!

ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల తీరు ఆందోళనకరంగా మారుతోంది. అనుమతులు లేకుండా ఆస్పత్రులు నడుస్తున్నాయి. ప్రతి వెయ్యి మంది జనానాకు ముగ్గురు నర్సులు చొప్పున ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన నిర్దేశకాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నర్సులపై పనిభారం అధికమవుతోంది. కార్మిక చట్టానికి భిన్నంగా వారు 8 గంటలకు బదులు 11 గంటలు పని చేస్తున్నారు. మహిళా ఉద్యోగులకు పని ప్రదేశంలో ప్రత్యేక సదుపాయాలు లేవు. హెల్త్ సెక్రటరీలకు వైద్య సేవలకు తోడు ఇతర ప్రభుత్వ అనుబంధ పనులు సైతం చెప్పడంతో వైద్య సేవల్లో నాణ్యత కొరవడుతోంది. ఉద్యోగ ఉన్నతి ప్రక్రియ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిలిచిపోవడంతో నర్సులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో ఐసీయూ విభాగంలో ఒక్కో బెడ్‌కు ముగ్గురు చొప్పున నర్సులు ఉండాలన్నది ఆచరణకు నోచుకోవడంలేదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా సేవలందిస్తు ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో వేధింపులకు గురవుతున్నారు. మార్చి 1న నిర్వహించిన ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశంలో గ్రాట్యుటీ చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, 30 ఏళ్ల సర్వీసు ఉంటేనే రూ.1.5 లక్షల గ్రాట్యుటీ ఇస్తామంటూ మెలిక పెట్టింది. 2024 డిసెంబర్‌లో సమస్యల పరిష్కారాన్ని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు ఆందోళనలు చేశారు. వారి పోరాటాన్ని వేధింపులు, పోలీస్ చర్యలతో అణచివేసింది. పలు దఫాలుగా నిర్వహించిన నర్సుల ఉద్యమాలు ఫలితంగా ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచింది. 180 రోజుల ప్రసూతి సెలవులకు అంగీకరించింది.

వైఎస్సార్ సీపీ హయాంలో ఆస్పత్రుల ప్రగతి

స్వాతంత్ర్యం వచ్చాకా రాష్ట్రంలో 11 వైద్య కళాశాలలు ఏర్పాటైతే, వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకొచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పీపీపీ విధానంతో ప్రైవేటుపరం చేయాలని చూస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నర్సింగ్ కౌన్సిల్‌తో ఎంఓయూ కుదుర్చుకుని నర్సింగ్ కోర్సులు చేసిన యువతలో నైపుణ్యాల పెంపునకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. 2019 ఆగస్టులో ఆశాల వేతనాలను రూ.10 వేలకు పెంచారు.

నర్సుల దినోత్సవ నేపథ్యం ఇదీ...

1820, మే 12న ఇటలీలో ధనిక కుటుంబంలో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టిన రోజును ప్రపంచ నర్సుల దినోత్సవంగా నిర్వహిస్తారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ నర్సెస్ 1965లో నర్సింగ్ డేను గుర్తించింది. యుద్ధ సమయంలో గాయాలపాలైన వారికీ, ప్రకృతి వైపరీత్యాలకు గురైనవారికీ ధైర్య సాహసాలతో వైద్య సేవలందించడంలో నర్సింగ్‌లో నైటింగేల్ తీసుకువచ్చిన సంస్కరణలు ఎంతో దోహదం చేశాయి. ఆమె రాసిన రచనలు వైద్యరంగాన్ని మరో మెట్టు ఎక్కించాయి. నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సెస్ పేరుతో సంస్థను స్థాపించి ఎందరో నర్సులను తయారు చేశారు. 1910 ఆగస్టు 13న లండన్‌లో ఆమె మృతి చెందారు.

చాకిరీ మూరెడు... వేతనం బెత్తెడు...

నర్సులు ప్రైవేటు ఆస్పత్రుల్లో రోజుకు 12 గంటలు పాటు సేవలందిస్తున్నారు. నెలకు వారికి ఇచ్చే వేతనం రూ.15 వేల లోపే. ప్రభుత్వ రంగంలోని నర్సులు సైతం వేతనాలు పెంచాలన్న డిమాండ్ అపరిష్కృతంగానే ఉంది. పీఎంఎంవీవై పథకం ద్వారా గర్భిణులను ప్రతి నెలా 9న ఆసుపత్రికి తరలించి పరీక్షలు చేయిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కిల్కారీ, మొబైల్ అకాడమీ సేవల్లో నర్సులు భాగస్వాములవుతున్నారు. జిల్లాకు సుమారుగా ఐదు వేల మంది చిన్నారుల చొప్పున ప్రతి నెల బుధ, శనివారాల్లో క్రమం తప్పకుండా టీకాలు వేస్తున్నారు.


కాకినాడ అర్బన్ పీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేస్తున్న నర్సులు

వైద్య, ఆరోగ్య సేవలకు అవకాశం కల్పించాలి



పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు చేసేందుకు పూర్తి స్థాయిలో అవకాశం ఇవ్వాలి. అలా కాకుండా సచివాలయ పరిధిలోని పనుల భారాన్ని మోపడం సరికాదు. హెల్త్ సెక్రటరీలను యాప్‌ల నిర్వహణకు మినహాయించాలి. ఫీల్డ్ వర్క్‌లో ఉన్నందున ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– జి.నాగ వరలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ

ట్రావెల్ బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మి

పెరవలి: మండలం ఖండవల్లి వద్ద మోటార్ సైకిళ్లను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. పెరవలి ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు తాడేపల్లిగూడేనికి చెందిన కపిలేశ్వరపు రామకృష్ణ అతని భార్య ఆదిలక్ష్మి, కుమారుడు హర్షతో కలసి మోటార్ సైకిల్‌పై పెనుగొండ మండలం రామన్న పాలెం వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టటంతో వారు ముగ్గురు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. మహిళకు ముఖంపై తగలటంతో తీవ్ర రక్త స్రావం అయ్యిందని, మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయని చెప్పారు. వీరు ముగ్గురిని వైద్యం కోసం తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని, ప్రాణ హాని లేదని వైద్యులు తెలిపారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఘటనాస్థలిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు




విద్యాసాగర్ (ఫైల్)

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల బైఠాయింపు
- సీఐ జోక్యంతో పరిస్థితి ప్రశాంతం

తాళ్లపూడి (కొవ్వూరు): మండలంలోని దోమ్మేరు శివారులో ఎదురుగా వస్తున్న ట్రాలీ ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడి క్కడే మృతి చెందాడు. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు దోమ్మేరు గ్రామానికి చెందిన చిగురుపల్లి విద్యాసాగర్ (18) కాపవరం వెళ్లి అక్కడ నుంచి మోటార్ సైకిల్‌పై వస్తుండగా కొవ్వూరు వైపు నుంచి పంగిడికి గడ్డితో వెళుతున్న ట్రాలీ ట్రాక్టర్ ఎదురుగా ఢీకొనడంతో విద్యాసాగర్ దాని చక్రాల కింద పడిపోయాడు. దీంతో అతని తల, ఇతర శరీరభాగాలు నుజ్జయ్యి మృతి చెందాడు. విద్యాసాగర్ కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి అరవింద్ కుమార్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి వెంకటలక్ష్మి, చెల్లి జ్యోత్స్న ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన కొడుకు మృతి చెందడంతో వారి రోదన వర్ణనాతీతమైంది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపించి తమకు న్యాయం చేయాలని పట్టుబట్టారు. సీఐ విజయబాబు ఘటనా ప్రదేశానికి చేరుకుని వారికి నచ్చ చెప్పి యువకుడి మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కోరుకొండలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కోరుకొండ: స్థానిక దేవునికోనేరు వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై కూన నాగరాజు తెలిపారు. 45 ఏళ్ల వయసున్న మృతదేహాన్ని గుర్తించినట్టు వీఆర్వో కొవ్వాడ రామకృష్ణ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించేందుకు వీలుగా 72 గంటల పర్యవేక్షణ నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

బాల్య వివాహం అడ్డగింత

యానాం: చట్ట వ్యతిరేకంగా జరుగుతున్న ఓ బాల్య వివాహాన్ని యానాం చైల్డ్ హెల్ప్‌లైన్‌కు వచ్చిన సమాచారం ఆధారంగా సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. ఆదివారం చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ సంసాని రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం నియోజకవర్గ పరిధిలో బాలయోగి నగర్‌లో 15 ఏళ్ల బాలికకు 22 ఏళ్ల యువకుడితో వివాహం చేస్తున్నారని తమకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు యానాం ఏఎస్సై పంపన మూర్తి, ప్రకాష్‌లను వెంటపెట్టుకుని ఆ ప్రాంతానికి వెళ్లి బాల్యవివాహాల నిరోధక చట్టం–2006 గూర్చి ఇరువురు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించామని, చట్టరీత్యా ఈ వివాహం నేరమని చెప్పి చెప్పినట్టు తెలిపారు. యానాంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 1098కు సమాచారం అందించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు.

పాడైన గుడ్లే పోషకాహారం!

- గొర్రిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ
- ఆందోళన వ్యక్తం చేసిన లబ్ధిదారులు


గొర్రిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసిన నాసిరకం కోడిగుడ్లు

కరప: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ లేక అక్కడి చిన్నారులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులకు, గర్భిణులకు పోషకాహారం నిమిత్తం అందించే కోడిగుడ్లపై అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలం గొర్రిపూడి మార్కెట్‌సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 7వ తేదీన సరఫరా చేసిన కోడిగుడ్లను ఆదివారం లబ్ధిదారులు ఇంటి వద్ద ఉడకబెట్టగా దుర్వాసనతో కుళ్లిపోయాయి. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికీ, ఎండకూ పాడయ్యాయి

ఈ విషయమై సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి వివరణ ఇస్తూ కోడి గుడ్లు చెడిపోవడం వాస్తవమేనని, అయితే వాటిని ఎవరికీ పంపిణీ చేయలేదన్నారు. నాలుగు రోజుల క్రితం కోడిగుడ్లు తీసుకు వచ్చే వ్యాన్ డ్రైవర్‌కు అకస్మాత్తుగా ప్లేట్‌లెట్లు పడిపోవడంతో కాకినాడ ఆసుపత్రిలో చేరారని, కోడిగుడ్లతో ఉన్న వ్యాన్‌ను బయట ఉంచేయడంతో వర్షానికి తడిసి, ఎండకు పాడైపోయాయని తెలిపారు. డ్రైవర్ కోలుకున్నాక ఈ విషయం ఏజెన్సీ యజమానికి చెప్పకుండా అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చి వెళ్లిపోయాడు. ఆదివారం కోడిగుడ్లు పాడైనట్టు గుర్తించిన వెంటనే ఏజెన్సీస్‌కి తెలియజేస్తే, పాడైన గుడ్లను వెనక్కి తీసుకుని, మంచివి ఇచ్చేందుకు అంగీకరించారని, ఇదే విషయాన్ని సీడీపీఓకు కూడా తెలియజేసినట్టు విజయలక్ష్మి తెలిపారు.

వాహనం అదుపుతప్పి యువకుడి మృతి


చొప్పెల్ల లాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆనంద్

ఆలమూరు: స్థానిక జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి ఆనంద్ (29) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మడికి గ్రామానికి చెందిన ఆనంద్ రాజమహేంద్రవరంలోని ఐసీఐసీఐ క్రెడిట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వ్యక్తిగత పని మీద తన బైక్‌పై రావులపాలెం వైపు వెళ్తుండగా స్థానిక లాకుల వద్ద అదుపు తప్పి కల్వర్టు గోడను ఢీకొట్టాడు. దీంతో ఆనంద్‌కు తలపై బలమైన గాయమై రక్తం పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై అశోక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టంకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆనంద్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఏడాది క్రితం అతడికి వివాహం కాగా భార్య, ఒక పాప ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని..

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం రైల్వే గేటు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం మేరకు అల్లూరిసీతారామరాజు జిల్లా ముంచంగిపుట్ట మండలం మచ్చేపురానికి చెందిన కోడ మోహన్ గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు లక్ష్మీపురంలో చేపల చెరువుల వద్ద పని చేస్తున్నాడు. ఆదివారం చేపల పట్టుబడి ఉండడంతో ఇతర కూలీలకు భోజనాలు తేవడానికి మోటారు సైకిల్‌పై చేబ్రోలు వెళ్లి తిరిగి వస్తుండగా ఏకే మల్లవరం రైల్వే గేటు వద్ద అత్యంత వేగంగా వచ్చిన ట్రాక్టర్ మోహన్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని..

తుని రూరల్: తుని మండలం టి.తిమ్మాపురం జంక్షన్ సమీపంలో లారీ ఢీ కొనడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. ఆదివారం విజయవాడ రాణీపేటకు చెందిన బూరాడ పట్టాభినాయుడు శుభలేఖలు ఇచ్చేందుకు శ్రీకాకుళం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. లారీ ఢీ కొనడంతో పట్టాభినాయుడు అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

భారతదేశానికి వ్యతిరేకంగా పోస్టు

- యువకుడి కోసం పోలీసుల గాలింపు


మిక్సర్ కాలనీలో రాజు కోసం ఆరా తీస్తున్న పోలీసులు

అమలాపురం రూరల్: మండలం కామనగరువు పంచాయతీ పరిధిలోని మిక్సర్ కాలనీకి చెందిన పూజారి రాజు అనే యువకుడు ఇటీవల జై పాకిస్థాన్ అంటూ ఫేస్‌బుక్ పోస్టు పెట్టాడు. ఆ పోస్ట్ ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు రాజు ఇంటికి చేరుకుని తనిఖీ చేశారు. అతడు ప్రస్తుతం విజయనగరం జిల్లా సాలూరులో ఉన్నట్లు అతని తండ్రి ఏసుబాబు పోలీసులకు తెలిపారు. తెలియక ఈ పోస్టు పెట్టినట్లు రాజు చెప్పినట్లు ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు. ఈ కుటుంబం గతంలో మిక్సర్ కాలనీలో ఉండేవారని, సోఫా పనుల కోసం వెళ్లి కుటుంబ మొత్తం విజయనగరం జిల్లా సాలూరులో నివసిస్తున్నారని స్థానికులు తెలిపారు. దీంతో పోలీసులు విజయనగరం పోలీసులకు సమాచారం అందించారు.

తొలిదశలో గుర్తిస్తే బోన్ క్యాన్సర్ నివారణ

- అమోర్ ఆసుపత్రి ఎండీ, బోన్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ కిశోర్‌రెడ్డి
- ఎముకలు, కీళ్లు, కండరాల క్యాన్సర్లపై పీఎంపీలకు అవగాహన


బోన్ క్యాన్సర్ చికిత్సలపై మాట్లాడుతున్న అమోర్ ఆసుపత్రి ఎండీ, బోన్‌క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ కిశోర్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బోన్ క్యాన్సర్ వచ్చిందంటే ఇక చివరిదశే అని చాలామంది అనుకుంటారు. అది పూర్తి అపోహేనని హైదరాబాద్‌కు చెందిన అమోర్ ఆస్పత్రి ఎండీ, బోన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిశోర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మోడల్‌కాలనీలో ఉన్న ఎఫ్ కెఫే హోటల్‌లోని ఫంక్షన్ హాలులో ఆదివారం ఉభయగోదావరి జిల్లాల్లోని పీఎంపీ వైద్యులకు ఎముకలు, కీళ్లు, కండరాల క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ కిశోర్‌రెడ్డి ఆదివారం అవగాహన కల్పించారు. కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎముకలకు కండరాలకు సంబంధించిన క్యాన్సర్‌కు కారణాలు, లక్షణాలు, రోగ నిర్ధారణ, చికిత్సలను వివరించారు. క్యాన్సర్లు వ్యక్తి జీవన నాణ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, ముఖ్యంగా బోన్ క్యాన్సర్లపై అవగాహన అవసరమన్నారు. బోన్ క్యాన్సర్‌కు గురైన ఎందరికో నేటి ఆధునిక వైద్యంతో నయం చేశామన్నారు. మూడేళ్ల చిన్నారికి సైతం బోన్ క్యాన్సర్ చికిత్స చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, రాష్ట్ర గౌరవ సలహాదారులు కోన చిన్నారావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ ప్రసాద్, ఎండీ తానీషా, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, సూరంపూడి వీరభద్రరావు, రాజమహేంద్రవరం అధ్యక్షుడు రహమాన్ ఖాన్, జిల్లా సహాయ కార్యదర్శి ఎ.ధనుంజయ్, కార్యదర్శి మట్టా రమేష్‌లతో పాటు అన్ని మండలాల నాయకులు హాజరయ్యారు.